క్లుప్తంగా

మహిళా ఉద్యోగుల భద్రతపై దృష్టి


సమావేశంలో పాల్గొన్న ఎంపీ గీత


కాకినాడ: మహిళా ఉద్యోగుల భద్రతపై మరింత అప్రమత్తత, జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీ వంగా గీత పేర్కొన్నారు. ముంబాయిలో మంగళవారం జరిగిన మహిళా సాధికార కమిటీ సమావేశానికి ఆమె హాజరయ్యారు. ఆయిల్ ఇండియా, ఓఎన్జీసీ, కేంద్ర ప్రభుత్వ ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్, కార్పొరేట్ అఫైర్స్, బ్యాంక్ ఆఫ్ బరోడా, యూబీఐ ఉన్నత స్థాయి అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా ఉద్యోగినుల భద్రత, రక్షణ, హక్కులపై చర్చించి అనేక సూచనలు ఇచ్చారు. ఆయా సంస్థల ద్వారా విడుదలయ్యే సీఎస్సార్ నిధులు, వాటి ప్రాధాన్యం, వినియోగంపై ఆమె ఆ చర్చల్లో పాల్గొన్నారు.

మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కృష్ణారావు


కృష్ణారావును అభినందిస్తున్న కృష్ణమూర్తి

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూతన మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘ ఉపాధ్యక్షుడిగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ కృష్ణారావు ఎన్నికయ్యారు. ఒంగోలులో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. కృష్ణారావును ఒలింపిక్ సంఘ చైర్మన్ చుండ్రు గోవిందరాజు, అధ్యక్షుడు ద్వారంపూడి వీరభద్రారెడ్డి, కర్రిభామిరెడ్డి, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ సంఘ అధ్యక్షుడు బి.కృష్ణమూర్తి, కార్యదర్శి ఎం.బాపిరాజు, సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ రాష్ట్ర సంఘం తనపై ఉంచిన నమ్మకానికి తగినట్టు పనిచేస్తానన్నారు.

న్యాయవాది దిలీప్ మృతి



కాకినాడ లీగల్: కాకినాడ బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది సంధి దిలీప్ మృతి చెందారు. దిలీప్ సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కాకినాడ బార్ అసోసియేషన్లో 2002లో న్యాయవాదిగా నమోదయ్యారు. ఆయద అకాల మృతికి బార్ అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీలు విశ్వేశ్వరరావు, శ్రీనివాస్, కమిటీ సభ్యులు, న్యాయవాదులు, ప్రముఖులు సంతాపం తెలిపారు.

డ్రైనేజీ నిర్మాణాల పరిశీలన


డ్రైనేజీ నిర్మాణాలను పరిశీలిస్తున్న కార్యదర్శి పాండురంగారావు, ఇంజనీరింగ్ సిబ్బంది

కాకినాడ రూరల్: మండలంలోని వాకలపూడిలో నిర్మిస్తున్న డ్రైనేజీలను డీఎల్డీవో పి.నారాయణ మూర్తి మంగళవారం పరిశీలించారు. గ్రామస్తులు వినతుల మేరకు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రతిపాదనలతో గ్రామ పంచాయతీ నిధులు రూ.49 లక్షలతో సుమారు 30 పనులను చేపడుతున్నారు. వివిధ దశల్లో ఉన్న డ్రైనేజీ నిర్మాణ పనులను పంచాయతీ కార్యదర్శి పాండురంగారావుతో కలిసి పరిశీలించారు.

బీజేపీ ఆధ్వర్యంలో 'నా భూమి-నా దేశం'




మట్టి సేకరణలో బీజేపీ నాయకులు

బోట్క్లబ్: బీజేపీ దక్షిణ మండల అధ్యక్షుడు చెక్కా రమేష్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సూర్యనారాయణపురంలో 'నా భూమి- నా దేశం' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపీ రాష్ట్ర మీడియా అధికార ప్రతినిధి యార్లగడ్డ రామ్కుమార్ మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్లో భాగంగా ఢిల్లీ అమృత ఉద్యాన వనం కడుతున్నారన్నారు. 75 ఎకరాల్లో కడుతున్న ఈ ఉద్యాన వనానికి అన్ని గ్రామాల్లో మట్టిని సేకరిస్తున్నామన్నారు. బీజేపీ నాయకులు దొడ్డి వీరేంద్ర, గొల్లపల్లి శివ, ఏలూరి రాణి, రత్నాల కృష్ణారావు, చెల్లూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

మట్టి గణపతే మేలు

- పీఓపీతో పర్యావరణానికి హాని
- ప్రచారం ముమ్మరం చేస్తున్న స్వచ్ఛంద సంస్థలు
- ప్రకృతిని పరిరక్షిద్దామని పిలుపు


రంగులతో ఆకర్షణీయంగా ఉన్న పీఓపీ విగ్రహాలు


విక్రయానికి సిద్ధంగా ఉంచిన మట్టి వినాయక విగ్రహాలు

కాకినాడ సిటీ: వినాయక చవితి వచ్చేస్తోంది. ప్రతి ఇంటా, ప్రతి వీధిలో గణనాథులు కొలువుదీరనున్నారు. ఏటా మాదిరిగానే ఈ ఉత్సవాల్లో మట్టి ప్రతిమలనే పూజించాలంటూ పర్యావరణ ప్రేమికులు ప్రచారం చేస్తున్నారు.

మట్టితో లాభాలు..

- సహజ సిద్ధంగా పొలాల్లో దొరికే బంక మట్టితో విగ్రహాలు తయారు చేయడం మంచిది. ఇవి నీటిలో సులభంగా కరిగిపోతాయి.

మట్టి వినాయక విగ్రహాల నిమజ్జనంతో నీటి వనరులకు ఎలాంటి నష్టం ఉండదు.

- సహజ సిద్ధమైన చెట్ల ఆకులు, బెరడుతో తయారు చేసే రంగులను మట్టి బొమ్మలకు అద్ది ఆకర్షణీయంగా తయారు చేసుకోవచ్చు.

రసాయనాలతో అనర్థాలు:

- ప్లాస్టర్ ఆఫ్ పారిస్తో తయారు చేసే విగ్రహాలు కాలువలు, నదుల్లో నిమజ్జనం చేసినా కరగవు.
- వీటికి పూసిన రంగులు నీటిని కలుషితం చేస్తాయి. ఈ నీటిని తాగిన పశువులకు జీర్ణవ్యవస్థ దెబ్బతింటుంది.
- ఈ రంగులు శరీరంలో నరాలపై ప్రభావం చూపి క్యాన్సర్కు దారి తీస్తుంది. చర్మవ్యాధులు వ్యాప్తి చెందుతాయి.
- రసాయనిక రంగులు కలిసిన నీరు పంట పొలాల్లో చేరి దిగుబడులు తగ్గించడమే కాకుండా ఆహార ఉత్పత్తులను కలుషితం చేస్తుంది.
- ప్లాస్టర్ ఆఫ్ పారిస్ నీటిలో కరగడానికి కొన్నేళ్లు పడుతుంది. నీరు, నేల, గాలి అన్నింటిపైన కాలుష్య ప్రభావం ఉంటుంది.

ముమ్మరంగా మండపాలు



నియోజకవర్గం అంతా వినాయక మండపాల ఏర్పాటుకు నిర్వాహకులు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. జిల్లాలో 21 మండలాలు 565 గ్రామ పంచాయతీలు, పట్టణాల్లో 12,500లకు పైగానే వినాయక మండపాలు ఏర్పాటు చేస్తున్నట్లు అంచనా. మండపాల్లో విగ్రహాల అందం, ఆకర్షణ కోసం రంగులద్దుకున్న ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వినాయక విగ్రహాలను వినియోగించడానికే ఎక్కువ మంది మొగ్గు చూపుతుంటారు. కాగా ప్రతి ఒక్కరు మట్టి ప్రతిమలనే ఏర్పాటు చేసుకుని ఉత్సవాలను నిర్వహించుకోవాలని, పీఓపీ త్వరగా మట్టిలో కలవదని పర్యావరణ నిపుణులు సూచిస్తున్నారు.

వాతావరణానికి హాని



ప్లాస్టర్ ఆఫ్ పారిస్ వాడడం వల్ల వాతావరణానికి ముప్పు వాటిల్లుతోంది. పర్యావరణ హితంగా వినాయక చవితి సంబరాలు ప్రజలు నిర్వహించుకోవాలి. అన్ని గ్రామాల్లో మట్టి వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసుకోవడం చాలా మంచిది.

– లింగం రవి, రాయుడుపాలెం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, రమణయ్యపేట

ప్రభుత్వం ప్రోత్సహించాలి



మట్టి వినాయక విగ్రహాలు నెలకొల్పేలా ప్రజలను ప్రోత్సహించాలి. పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా ప్రభుత్వం నిధులు వెచ్చించి మట్టి విగ్రహాలు పంపిణీ చేయాలి. తద్వారా పర్యావరణానికి నష్టం వాటిల్లదు.

– అనిశెట్టి రామకృష్ణ, బంగారు, వెండి, డైమాండ్స్ వర్తక సంఘం అధ్యక్షుడు, కాకినాడ

పర్యావరణ పరిరక్షణపై పోటీలు


పోస్టర్ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

కాకినాడ సిటీ: పర్యావరణాన్ని కాపాడటంతో పాటు మట్టి వినాయక విగ్రహాల తయారీ, వినియోగంపై అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న పోటీల పోస్టర్ను కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం ఆవిష్కరించారు. ఎకో-ఫ్రెండ్లీ గణేష్ ఉత్సవ్-2023 పేరుతో నిర్వహిస్తున్న 2కె రన్, డ్రాయింగ్, వ్యాస రచన, మట్టి వినాయక విగ్రహాల తయారీ పోటీలపై అల్ఫాబెట్ ఎడ్యుకేషనల్ హబ్ సంస్థ రూపొందించింది. పీఓపీని నివారించడం, కాలుష్యం నుంచి ప్రకృతిని రక్షించడంలో భాగంగా ఈ నెల 17వ తేదీన నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాల్లో పట్టణ వాసులు ఉత్సాహంగా పాల్గొని, అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ కోరారు. సంస్థ వ్యవస్థాపకులు రేవంత్ కొప్పిశెట్టి, మోనికా శీలం తదితరులు పాల్గొన్నారు.

చమురు సంస్థల పరిహారం అందేలా కృషి చేస్తా


గడప గడపకూ మన ప్రభుత్వంలో ప్రజలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

- మత్స్యకారులకు ద్వారంపూడి హామీ
- ఏటిమొగలో గడప గడపకూ ప్రభుత్వం

కాకినాడ: రిలయన్స్ ఓఎన్జీసీ తదితర చమురు సంస్థల కార్యకలాపాల నేపథ్యంలో ఇచ్చే పరిహారాన్ని కాకినాడ ప్రాంత మత్స్యకారులకు కూడా అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్రెడ్డి హామీ ఇచ్చారు. మంగళవారం ఆయన స్థానిక 15వ డివిజన్ ఏటిమొగ ప్రాంతంలో గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, కౌడా చైర్పర్సన్ రాగిరెడ్డి చంద్రకళా దీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి, పలువురు అధికారులు, నాయకులు, కార్యకర్తలు ఆయన వెంట ఉన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 14, 15 డివిజన్లు మినహా నగరమంతా గడపగడపకు మన ప్రభుత్వం పూర్తయిందన్నారు. చమురు సంస్థల కార్యకలాపాల వల్ల నష్టపోతున్న ముమ్మిడివరం, యానం పరిసర ప్రాంత మత్స్యకారులకు పరిహారం ఇస్తున్నట్టే ఇక్కడివారికీ అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. పరిహారం చెల్లింపు విషయాన్ని సీఎం జగన్ దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానన్నారు. ఏటిమొగ ప్రాంతంలో తనకు మెజారిటీ ఇవ్వకపోయినా, రాజకీయాలకు అతీతంగా ఆ ప్రాంత అభివృద్ధికి, స్థానికంగా నివసించే మత్స్యకారుల అభ్యున్నతికి ఎంతో కృషి చేశానన్నారు. చక్కని ప్రాంతంలో ఇక్కడి మత్స్యకారులకు స్థలాలు కేటాయించి త్వరలోనే ఇళ్ల నిర్మాణం కూడా పూర్తి చేస్తున్నామన్నారు. పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు కూడా ఆశీర్వదించాలని, జగన్ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే ద్వారంపూడి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార నాయకులు కాటాడి జానకిరామ్, భీమరాజు, సత్తిబాబు, పలువురు మత్స్యకార నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్తో పర్యావరణానికి ముప్పు

కాకినాడ రూరల్: ప్లాస్టిక్ సంచుల వినియోగంతో పర్యావరణానికి ముప్పుతో పాటు ప్రజలు అనారోగ్యాల బారిన పడే అవకాశం ఉందని పోషకాహార నిపుణులు పి. పార్థసారథి పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్లో బోట్క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల శూన్య దినోత్సవం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ సంచుల స్థానే గుడ్డ సంచులను వినియోగించాలని పార్థసారథి తెలిపారు. అడబాల రత్న ప్రసాద్, రవిశంకర్ పట్నాయక్ ,రాజా తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల పంపిణీ

కాకినాడ రూరల్: సర్పవరం జంక్షన్లో లయన్స్ క్లబ్ కాకినాడ ప్రొఫెషనల్స్ ఆధ్వర్యంలో లయన్ ద్వారంపూడి విపుల్ రెడ్డి సౌజన్యంతో దీర్ఘకాలిక రోగులకు కోడిగుడ్ల పంపిణీ చేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్నో పోషకాలు ఉన్న ఆహారంగా కోడిగుడ్డును గుర్తించారన్నారు. అడబాల రత్న ప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, రాఘవరావు, లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడిగా ముసలయ్య


సంఘం అధ్యక్షుడు ముసలయ్య తదితరులను అభినందిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

- నూతన కమిటీకి ఎమ్మెల్యే కురసాల అభినందన

కాకినాడ రూరల్: నాయీ బ్రాహ్మణ సేవా సంఘం మండల కమిటీని ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అభినందించారు. రమణయ్యపేటలో నాయీ బ్రాహ్మణ సేవా సంఘం భవనంలో ధన్వంతరి నాయీ బ్రాహ్మణ సమాఖ్య జిల్లా అధ్యక్షుడు పొన్నాడ సత్యనారాయణ అధ్యతన మంగళవారం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. నూతన కమిటీ అధ్యక్షుడుగా సర్పవరానికి చెందిన వాడపల్లి ముసలయ్య, ప్రధాన కార్యదర్శిగా చింతలూరు వీర వెంకట శివప్రసాద్, కోశాధికారిగా పైన గణేష్, ఉపాధ్యక్షులుగా తెల్లగ్రాపు శ్రీనివాస్, పేరూరి రాజు, సంయుక్త కార్యదర్శిగా సుందరపల్లి వీర మాణిక్యం, ఆర్గనైజింగ్ సెక్రటరీగా పట్నాల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షులుగా లంక అప్పారావు, కోట ఉమా అచ్యుత రమణ ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కన్నబాబు సత్కరించారు. నాయీ బ్రాహ్మణులంతా వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి అండగా ఉండాలని సీఎంగా మళ్లీ జగన్మోహన్రెడ్డి, ఎమ్మెల్యేగా తాను గెలిచేందుకు అండగా ఉండాలని కోరారు. మరో అతిథి ధన్వంతరి నాయీ బ్రాహ్మణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సుందరపల్లి గోపాలకృష్ణ మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే న్యాయం జరిగిందని, సీఎం జగన్ తమ కులస్తులకు సముచిత స్థానం కల్పించారన్నారు.

సంఘం భవనం అభివృద్ధి పనుల ప్రారంభం

మండలంలోని రమణయ్యపేట పంచాయతీ పరిధి గైగోలుపాడులోని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం భవనం చుట్టూ రూ.5 లక్షలతో కాంపౌండ్ వాల్, ఇతర అభివృద్ధి పనులను ఎమ్మెల్యే కన్నబాబు ప్రారంభించారు. నాయీ బ్రాహ్మణులకు దేవాలయాల ఆలయ కమిటీల్లో సభ్యులుగా నియమించి, వారి అభివృద్ధికి సహకరిస్తున్నారన్నారు. భావనారాయణ స్వామి, తూరంగేశ్వరస్వామి ఆలయాలకు, నియోజకవర్గంలో అన్ని ఆలయాల కమిటీలలో నాయీ బ్రాహ్మణులను సభ్యులుగా నియమించామన్నారు. ఈ సందర్భంగా భావనారాయణ స్వామి, బాల త్రిపుర సుందరి ఆలయ కమిటీ సభ్యులైన నాయీ బ్రాహ్మణులను అభినందించారు.

సాఫ్ట్వేర్ కోర్సులతో మెరుగైన ఉపాధి

- కౌడా చైర్పర్సన్ చంద్రకళాదీప్తి


ఒడిగోస్ బ్రోచర్ను ఆవిష్కరిస్తున్న కౌడా చైర్పర్సన్ చంద్రకళాదీప్తి

కాకినాడ రూరల్: సాఫ్ట్వేర్ కోర్సుల్లో తర్ఫీదు ఇవ్వడం ద్వారా కాకినాడ, పరిసర ప్రాంతాల యువతకు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభించే అవకాశం ఉందని, ఆ విధంగా శిక్షణ సంస్థలు కృషి చేయాలని కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి సూచించారు. రమణయ్యపేటలోని వీజేఎస్ఎంఆర్ ఒడిగోస్ కార్యాలయంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఢిల్లీకి చెందిన ఐడీఏతో ఒప్పందానికి సంబంధించి బ్రోచర్ను ఆవిష్కరించారు. ఒడిగోస్ మేనేజింగ్ పార్టనర్ వారా వినోద్, వైఎస్సార్ సీపీ నాయకుడు గగారిన్, విల్సన్, వార మేరీ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం


నడకుదురులో కమ్యూనిటీ హాళ్ల నిర్మాణంపై చర్చించి సూచనలిస్తున్న ఎమ్మెల్యే కన్నబాబు

కరప: నియోజకవర్గ పరిధిలోని గ్రామాలను అన్ని విధాలా అభివృద్ధి చేసి, మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు ఎమ్మెల్యే కురసాల కన్నబాబు అన్నారు. నడకుదురులో మంగళవారం స్థానిక నాయకులు, అధికారులతో కలసి ఎమ్మెల్యే పర్యటించి అభివృద్ధి పనులపై చర్చించి, వివిధ ప్రాంతాల్లో నిర్మించాల్సిన కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి స్థలాలను పరిశీలించి, పనులు సత్వరమే ప్రారంభించి, సకాలంలో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. గడప గడపకూ మన ప్రభుత్వం నిర్వహించినప్పుడు ఎస్సీ, బీసీ, ఓసీ వీధులలో సీసీ రోడ్లు, డ్రైయిన్లు కావాలని, కమ్యూనిటీ హాళ్లు నిర్మించాలని ప్రజల నుంచి వచ్చిన వినతుల మేరకు గడప గడపకూ నిధులు రూ.80 లక్షలు, జెడ్పీ, పంచాయతీ నిధులు మంజూరు చేసినట్టు ఎమ్మెల్యే కన్నబాబు తెలిపారు. సర్పంచ్ డేగల లలితకుమారి, ఎంపీటీసీ సభ్యుడు ముమ్మిడి బుచ్చిరాజు, మాజీఎంపీటీసీ జవ్వాది సతీష్, వైఎస్సార్ సీపీ నాయకులు పైలా గోవిందు, పోతల లోవప్రసాద్, డీఎల్డీఓ పాటంశెట్టి నారాయణమూర్తి, మండల ఇంజినీరింగ్ అధికారి జి.శైలజ, గ్రామ కార్యదర్శి పీఎస్సార్ బ్రహ్మానందం తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితా సవరణకు సహకరించండి


రాజకీయ పార్టీల ప్రతినిధులతో చర్చిస్తున్న ఈఆర్వో, కమిషనర్ నాగనరసింహారావు


వివిధ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న ఆర్డీవో సత్యనారాయణ

- ఈఆర్వో నాగనరసింహారావు
- రాజకీయ పార్టీల నేతలతో సమావేశం

కాకినాడ: ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ సజావుగా సాగేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని నియోజకవర్గ ఈఆర్వో, నగరపాలక సంస్థ కమిషనర్ సీహెచ్ నాగనరసింహారావు కోరారు. స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం కొత్త ఓటర్ల నమోదు, అభ్యంతరాలు, మార్పులు, చేర్పులు, ఓటర్ల తొలగింపు తదితర క్లెయిముల ప్రగతిని రాజకీయ పార్టీలకు వివరించి, వారిచ్చిన సూచనలు స్వీకరించారు. నియోజకవర్గ పరిధిలో ఫారం-6 కింద కొత్త ఓట్ల నమోదు కోసం 4,697 దరఖాస్తులు రాగా, 1916 పరిష్కరించామన్నారు. వేర్వేరు ప్రాంతాల్లో రెండేసి ఓట్లు, మరణించిన ఓటర్లు, తొలగింపులకు సంబంధించి 18,510 దరఖాస్తులు రాగా 10,717 పరిష్కరించామని అన్నారు. ఇక ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పుల కోసం 33,353 దరఖాస్తులు రాగా 23,413 పరిష్కరించామని అన్నారు. మిగిలిన వాటిని 15వ తేదీలోగా పరిష్కరిస్తామని అన్నారు. అలాగే పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై ప్రభుత్వ భవనాలు అందుబాటులో లేని పరిస్థితుల్లో రాజకీయ పార్టీల ప్రతినిధుల సూచనల మేరకు తదుపరి ప్రతిపాదనలు చేస్తామన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ తరఫున రావూరి వెంకటేశ్వరరావు, రాగిరెడ్డి సుబ్బారావు, ఎంజీకే కిశోర్, టీడీపీ నుంచి వెంకటేశ్వరరావు, సీపీఎం నుంచి వనమాడి వీరబాబు, బీఎస్పీ నుంచి అప్పారావు, ఆమ్ ఆద్మీ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనే లక్ష్యం

కాకినాడ సిటీ: సంక్షిప్త ఓటర్ల జాబితాకు సంబంధించి మార్పులు, చేర్పులు, గ్రామాంతరం, ఒకే ఇంటిలో 10 కంటే ఎక్కువ ఓటర్లు, ముఖ్యంగా శతాధిక ఓటర్లను గుర్తించినట్టు ఆర్డీవో ఎస్వీవీ సత్యనారాయణ అన్నారు. మంగళవారం నియోజకవర్గం ఈఆర్వో, ఆర్డీవో ఎస్వీవీ సత్యనారాయణ తన కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమీక్షించారు. ఓటర్ల జాబితాలో తప్పొప్పులు, తొలగింపులు, శతాధిక ఓటర్ల గుర్తింపు తదితర అంశాలను పారదర్శకంగా పరిశీలించి సమగ్ర ఓటర్ల జాబితాను రూపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రాజకీయ పార్టీల ప్రతినిధులకు తెలిపారు. వివిధ పార్టీల ప్రతినిధులు రావూరి వెంకటేశ్వరరావు, ఎస్.అప్పారావు, కె.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రాకెట్ నమూనాలకు పూర్వ వైభవం

- పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం
- తలాటం సేవలకు అధ్యాపకుల సత్కారం


రాకెట్ నమూనా వద్ద తలాటం హరీష్, ప్రిన్సిపాల్ తిరుపాణ్యం, అధ్యాపకులు

బాలాజీచెరువు: చంద్రయాన్-3 విజయోత్సవ వేడుకల్లో భాగంగా పీఆర్ కళాశాల పూర్వ విద్యార్థి, హరీష్ చారిటబుల్ ఆర్గనైజేషన్ చైర్మన్ తలాటం హరిష్ కళాశాలలో మరుగున పడ్డ రాకెట్ నమూనాలకు పూర్వ వైభవం తీసుకురావడం అభినందనీయమని పీఆర్ కళాశాల ప్రిన్సిపాల్ తిరుపాణ్యం పేర్కొన్నారు. కళాశాల భౌతిక శాస్త్ర విభాగం మ్యూజియంలో చంద్రయాన్ రాకెట్ల నమూనాలను ఆ సంస్థ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. పీడీ వర్మ స్వాగతం పలకగా ప్రిన్సిపాల్ తిరుపాణ్యం ముఖ్య అతిథిగా, హరీష్ విశిష్ట అతిథిగా, ఓల్డ్ స్టూడెంట్స్ అలుమిని కార్యదర్శి సత్య స్వరూప్ గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి హరీష్ చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా హరీష్ను ప్రిన్సిపాల్ అధ్యాపకులు సత్కరించారు. కార్యక్రమంలో గ్రౌండ్ యుజర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పంపన సాయి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష అమలుకు చర్యలు


కరపలో జగనన్న ఆరోగ్య సురక్షపై సమీక్షిస్తున్న ఎంపీడీఓ అప్పారావు

కరప: జగనన్న ఆరోగ్య సురక్ష నిర్వహణకు అన్ని చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.అప్పారావు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం గ్రామ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఆరోగ్య, విద్యాశాఖాధికారులతో ఆయన సమీక్షించి సూచనలిచ్చారు. ఈ నెల 30వ తేదీ నుంచి ఈ కార్యక్రమాన్ని నెల రోజుల పాటు అమలు చేస్తూ వైద్య శిబిరాలు నిర్వహించి ఆరోగ్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేస్తారన్నారు. ఎవరికైనా ఆపరేషన్లు అవసరమైతే కాకినాడ ఆస్పత్రికి రిఫర్ చేస్తామని తెలిపారు. ఈ లోపు గ్రామ వలంటీర్లతో ఇంటింట సర్వే చేయించి, ఆరోగ్య సమస్యలతో బాధపడుతన్నవారి వివరాలు సేకరించాలన్నారు. అనంతరం జగనన్న పాలవెల్లువ అమలుపై ఆయన సమీక్షిస్తూ మండలంలోని అనిగ్రామాల్లో పాలసేకరణ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే జగనన్న కాలనీలలో సోపింగ్ పిట్ల నిర్మాణంపై సమీక్షించారు. ఎంఈఓ-1 కె.బుల్లికృష్ణవేణి, ఎంఈఓ-2 పి.సత్యనారాయణ, కరప, వేళంగి పీహెచ్సీల వైద్యులు డాక్టర్ ఆర్.శ్రీనివాస్నాయక్, డాక్టర్ ఎంకే సౌజన్య, ఈఓపీఆర్డీ ఎస్వీ శ్రీనివాసరావు, హౌసింగ్ ఏఈఈ ఎస్.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబాలకు చెక్కుల అందజేత

కాకినాడ క్రైం: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన హోంగార్డులతో పాటు, ఇంకొందరు విశ్రాంత హోంగార్డులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుస్తూ ఆర్థిక సాయం అందజేశారు. ఈ ఏడాది జనవరి 23వ తేదీన విధి నిర్వహణలో మరణించిన హోంగార్డు గోవిందు భార్య దివ్యకు సహచరులు ఒక రోజు వేతనాన్ని సమకూర్చారు. ఈ రూ.2.16 లక్షలు మొత్తాన్ని ఎస్పీ సతీష్ కుమార్ మంగళవారం ఆయన కార్యాలయంలో దివ్యకు అందజేశారు. అలాగే దివంగత హోంగార్డు బాలకృష్ణ భార్య వెంకటలక్ష్మికి ఫ్లాగ్ ఫండ్ నుంచి సమకూరిన రూ.10 వేల మొత్తాన్ని అందజేశారు. ఉద్యోగ విరమణ పొందిన డి.సుబ్రహ్మణ్యం, సీహెచ్ అప్పారావు, సీహెచ్ భాస్కరరావు, ఎ.శ్రీనివాసరావులకు ఎస్పీ చెక్కులు అందజేశారు. ఏఆర్ అదనపు ఎస్పీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్పర్జన్రాజు సేవలు చిరస్మరణీయం

- జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి


స్పర్జన్రాజు చిత్ర పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న అతిథులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రీడారంగానికి డాక్టర్ స్పర్జన్రాజు సేవలు చిరస్మరణీయమని జీజీహెచ్ సూపరిటెండెంట్ డాక్టర్ హేమలతాదేవి పేర్కొన్నారు. మంగళవారం రంగరాయ వైద్య కళాశాల ఆడిటోరియంలో స్పర్జన్ రాజు సంస్మరణ సభ నిర్వహించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో తొలుత స్పర్జన్రాజు చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన జూమ్ మీటింగ్లో స్పర్జన్ రాజు మృతికి వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ వీసీ డాక్టర్ బాబ్జీ, విశ్రాంత డీఎంఈ డాక్టర్ రాఘవేంద్రరావు, విశ్రాంత ఏడీ డాక్టర్ మహాలక్ష్మి సంతాపం తెలిపారు. రంగరాయ వైద్య కళాశాల సిబ్బంది, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది స్పర్జన్రాజు సేవలను కొనియాడారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ దేవిమాధవి, జీజీహెచ్ వైద్యులు విఠల్, విష్ణుమహేష్, లావణ్య, రుక్మిణీదేవి, జాన్ సుధీర్, కుటుంబ సభ్యులు గాంధీ తదితరులు పాల్గొన్నారు.